# బుద్ధి

**స**త్యమూర్తి, వెంకట్రావు చిరకాల మిత్రులు. చదువు పూర్తిచేసుకుని వెంకట్రావు అమెరికా వెళ్ళిపోయాడు. సత్యమూర్తి మన దేశంలోనే వుండిపోయాడు. చాలా ఏళ్ళ తర్వాత మిత్రులిద్దరూ కలుసుకున్నారు. ఇతరులకు విసుగు తెప్పించేటంతగా, చిన్ననాటి విషయాలు నెమరు వేసుకుంటున్నారు.

"అప్పుడే పదకొండైపోతోంది, ఈ రాత్రికి అన్నయ్యగార్ని నిద్రపోనివ్వరా!" అంటూ వచ్చింది సత్యమూర్తి భార్య.

"మేం సంతోషంగా చిన్ననాటి విషయాలు ముచ్చటించుకుంటూంటే మధ్యలో నీకెందుకే. ఉద్యోగరీత్యా ఎక్కడెక్కడో పడున్నాం. అసలీ వెంకట్రావు మన దేశానికి వచ్చినట్లే తెలీదు నాకు. వీడి అన్నయ్య ధర్మమా అని యిన్నాళ్ళకు కలుసుకున్నాం. నువ్వెళ్ళి నిద్రపో!"

"చూడండి అన్నయ్యగారూ, ఈయనగారు యిదీవరస. నేనేం మాట్లాడినా పదింతలు మాట్లాడి, ఆయన వాక్చాతుర్యం ప్రదర్శిస్తారు".

"వీడిప్పుడే కాదమ్మా, చిన్నప్పట్నుంచీ యిదే వరస. ఎదుటివాళ్ళను మాట్లాడనివ్వడు. వీడ్ని యిక మనవలు తప్ప ఎవరూ ఆపలేరు".

మళ్ళీ మొదలైందిమిత్రుల సంభాషణ.

"అరే మూర్తి! నీకు జ్ఞాపకం వుందా, మన కాలేజీ దగ్గర్లో ఒక పాడుపడిన పెద్ద మేడ వుండేది. ఆ పాడుపడిన తలుపుల్ని, రాయి తీసుకుని క్రికెట్ బాల్ బౌలింగ్ చూస్తున్నట్లు గట్టిగా కొట్టేవాడవు. ఒకసారి మన క్లాస్‌మేట్ ఒకతనితో, "ఏంకాదు! మీరు కూడా ఈరాయి తీసుకుని గట్టిగా కొట్టండి" అని, అతనిచేత కూడా కొట్టించావు. పాపం అతని దురదృష్టం. లోపల్నుంచి వాచ్‌మెన్ వచ్చి అతన్ని "ఇందాకట్నుంచి చూస్తున్నా! ఏదోలే కుర్రాళ్ళు కదా అని వూరుకుంటే, అదే పనిగా రాళ్ళు వేసి కొడతారా" అని ఛడామడా తిట్టాడు" అన్నాడు వెంకట్రావు.

ఈ మాటలు విన్న శ్రీమతిమూర్తి "అబ్బో! అలా ఎదుటివాళ్ళని యిరికించడంలో పెద్ద దిట్ట మీ మిత్రుడు. జీవితంలో బయటపడలేని ఈ సంసారంలో నన్ను కూడా యిరికించారు" అంది.

''బాగుంది. ఈ వెంకట్రావుగాడు నామీద వున్నవీలేనివీ చెప్పడం, నువ్వేమో వీడికి వంతపాడడం. చాలు యిక పడుకో''.

''మెలుకువగా వుండి మీచిన్ననాటి కృష్ణలీలలు విని సంతోషిద్దామని యిక్కడే కూర్చున్నాను'' అంది శ్రీమతిమూర్తి.

''సరే... గొప్పేలే! నువ్వు తెలివైనదానివని ఈపాటికి మా వెంకట్రావుగాడికి అర్థమైపోయుంటుందిలే! నువ్వు పొద్దున్న అయిదు గంటలకల్లా మాకు కాఫీ యివ్వాలి. పొద్దున్నే టీవీలో వచ్చే ఆరాధనా కార్యక్రమాలు చూస్తాం మేం''.

శ్రీమతి మూర్తి నిద్రకుపక్రమించింది.

''అరే! మన తెలుగు లెక్చరర్ భాస్కరశర్మగారిప్పుడు ఎక్కడ వున్నారో, తర్వాత ఆయన డాక్టరేట్ చేశారని విన్నాను'' అన్నాడు వెంకట్రావు.

''ఆయన ఢిల్లీలో వాళ్ళబ్బాయి దగ్గర వున్నారట''.

''మన క్లాస్‌మెట్ హార్లిక్స్ సీసా అన్న నిక్‌నేమ్‌తో ఒకడుండేవాడు. ఎప్పుడూ తిన్నగా కాలేజీకి వచ్చేవాడు కాదు. భాస్కర్ శర్మగారు ''చిన్నయసూరి వ్యాకరణం'' చెపుతూంటే పెద్ద చదువుమీద ఆసక్తి వున్నవాడిలా లేచి నిలబడి, ''మాస్టారూ! అరసున్నా ఎప్పుడు వస్తుంది, నిండు సున్నా ఎప్పుడు వస్తుంది?'' అని అడిగాడు అప్పుడు మాస్టారు 'నాయనా! యిలా చదివితే అరసున్నా, యింత కన్న బాగా చదివితే నిండుసున్నా వస్తుంది' అన్నారు. క్లాసంతా ఘొల్లుమని ఒకటే గోల చేశారు'' అంటూ వెంకట్రావు నవ్వుతూ చెప్పాడు.

''ఔను. ఆ తర్వాతే కదా వాడి నిక్‌నేమ్ నిండు హార్లిక్స్ సీసా అని మార్చాం'' అన్నాడు మూర్తి.

''ఈ జోక్ అమెరికాలోని మన తెలుగువాళ్ళకి చెపితే పగలబడి నవ్వేవారురా!''

అలా మాట్లాడుకుంటూ యిద్దరూ, నిద్రాదేవి ఒడిలోకి వాలిపోయారు.

తెల్లారకట్ల ఏదో చప్పుడైంది. మంచి నిద్రలోనున్న మూర్తి, పిల్లి అయివుంటుందని లేవలేదు.

తెల్లారకట్ల నాలుగున్నరకి లేచారు. కాఫీ తాగి టీవీ పెడదామని రిమోట్

నొక్కాడు, మూర్తి. టీవీ ఆన్ కాలేదు. దగ్గరికి వెళ్ళి బటన్ నొక్కాడు. 'చైల్డ్‌లాక్ ఆన్' అని కనిపించింది. చైల్డ్‌లాక్ తీద్దామని రిమోట్‌తో ప్రయత్నం చేశాడు. రిమోట్ పనిచెయ్యలేదు.

"ఆ రిమోట్ తెరచి చూస్తే అందులో అసలు బ్యాటరీలే లేవు. మనవణ్ని లేపి "ఏమిట్రా చైల్డ్‌లాక్ చేశావా!" అని అడిగాడు.

వాడు మహాగడసరి 'మీకంటే ముందే పడుకున్నాను కదా, తాతా!" అన్నాడు.

"అదిసరే! ఈ రిమోట్‌లో వున్న బ్యాటరీలు ఏమయ్యాయి?"

"తెల్లారకట్ల ఏదో చప్పుడైంది. ఏ పిల్లేనా ఎత్తుకుపోయిందేమో తాతా"

ఒకసారి రిమోట్ దాచేసి "ఏదో పిల్లి ఎత్తుకుపోయిందన్నాడు" మూర్తి. "వీడు సరైన సమయం చూసి కొట్టాడు దెబ్బ. బ్యాటరీలు దాచేసి వుంటాడు" అనుకున్నాడు మూర్తి.

ఆ చైల్డ్‌లాక్ మిత్రుల్ని వెక్కిరించింది. భక్తి కార్యక్రమాలు హుళక్కి అయిపోయాయి.

ఇదంతా చూసిన శ్రీమతిమూర్తి "వీడివన్నీ వాళ్ళ తాతబుద్ధులే అన్నయ్యగారూ" అంది.

"ఔనమ్మా కరెక్టుగా చెప్పావ్. ఈ మూర్తిగాడు కూడా చిన్నప్పుడు మా పుస్తకాలు పెన్నులూ దాచేసి మమ్మల్ని ఏడిపించేవాడు. అందుకే దేవుడు బ్యాటరీలు దాచేసే మనవణ్ని యిచ్చాడు. రిమోట్ పనిచెయ్యకపోతే చైల్డ్‌లాక్ తియ్యలేరని మీ మనవడికి తెలుసు. తాతకి దగ్గులు నేర్పే మనవడు వీడు" అంటూ ఒక వంద రూపాయలు నోటు వాడిచేతిలో పెట్టాడు వెంకట్రావు.

"మీ మిత్రుడు గురించి యిటువంటి విషయాలు తెలుస్తాయనే, చాలాసేపు మెళకువగా వున్నాను నిన్న రాత్రి, అన్నయ్యగారూ!" అంది మూర్తి భార్య చిరునవ్వుతో, మగనికేసి చూస్తూ.

"ఇదుగో తాతా! ఈ డబ్బు పెట్టికొత్త బ్యాటరీలు కొనుక్కో" అన్నాడు మనవడు.

(ఆంధ్రభూమి సచిత్రవారపత్రిక, 23-3-2006)